ప్రజాశక్తి
సోమవారం 17 ఏప్రిల్ 2023



సమస్యలు వింటూ..హామీలు ఇస్తూ...

- పత్తికొండ నియోజకవర్గం నుంచి ఆలూరులోకి - ముందుకు సాగిన యువగళం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/తుగ్గలి

సమస్యలు వింటూ.. హామీలు ఇస్తూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం తుగ్గలి మండలం రాంపురం క్రాస్ నుంచి ప్రారంభమై మారెళ్ల మీదుగా ఆలూరు నియోజకవర్గం ఎంకె.కొట్టాలకు చేరుకుంది. మారేళ్లలో బీసీ సామాజిక వర్గ ప్రతినిధులతో నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను తిరిగి తీసుకొస్తామన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఎంకె.కొట్టాల వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. ఆదివారం మొత్తంగా 15.4 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. ఆలూరు నియోజకవర్గంలో కోట్ల సుజాతమ్మ, కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, కోట్ల రాఘవేంద్ర రెడ్డి లోకేష్‌కు స్వాగతం పలికారు.

లోకేష్‌ను కలిసిన సిపిఐ నాయకులు...

తుగ్గలి మండలం రాంపల్లి సిపిఐ నాయకులు లోకేష్‌ను కలిసి గ్రామ సమస్యలను విన్నవించారు. 20 ఏళ్లుగా గ్రామానికి సిసి రోడ్లు లేవని, వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. డ్రెయినేజీ పూడిక తీయక మురుగునీరు రోడ్లపై పారుతోందని, అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వివరించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రాంపల్లి వాసుల సమస్యలను పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

కంపెనీలు పెట్టి ఉపాధి కల్పించాలి - లోకేష్‌కు విన్నవించిన యువత

ఉద్యోగాలు కోసం బెంగళూరు, హైదరాబాద్, ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోందని, కంపెనీలు పెట్టి యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని తుగ్గలి మండల యువత లోకేష్‌కు విన్నవించారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ తెస్తానని జగన్ రెడ్డి హామీ ఇచ్చి, నేటికీ అమలు చేయలేదన్నారు. పత్తికొండలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతేడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

లోకేష్‌ను కలిసిన మహిళలు



సమావేశంలో మాట్లాడుతున నారా లోకేష్

రాంపల్లిలో మహిళలు యువనేత లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. గ్రామాల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని కోరారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభయ హస్తం పథకాన్ని కొనసాగిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

పంటలు సరిగా పండక ఇబ్బందులు - సమస్యలను విన్నవించిన రైతులు

మూడేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సరిగా పండక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మారెళ్ల రైతులు యువనేత నారా లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సబ్సిడీలన్నింటినీ పునరుద్ధరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. రాయలసీమలో గొలుసుకట్టు చెరువులకు నీరందించి సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు.

వైసిపి ఎమ్మెల్యే శ్రీదేవి గ్యాంగ్ కబ్జా ఆధారాలు ఇవిగోండి

- దళితుల భూమిని కబ్జా చేసిన వైసిపి నేతల వివరాలు వెల్లడించిన లోకేష్

దళితుల భూములు కబ్జా చేసిన ఎమ్మెల్యే శ్రీదేవి గ్యాంగ్‌కు సంబంధించిన ఆధారాలను టిడిపి యువనేత నారా లోకేష్ విడుదల చేశారు. శనివారం పత్తికొండ బహిరంగ సభలో చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన దళితులు భూములు ఆక్రమించుకున్నారని నారా లోకేష్ విమర్శించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆ కబ్జాలతో తనకు సంబంధం లేదని, అవినీతి చేయలేదని ప్రెస్‌మీట్ పెట్టారు. దళితుల భూములను వైసిపి నేతలు ఆక్రమించారని, దానికి సంబంధించిన ఆధారాలను లోకేష్ బయటపెట్టారు. 'పేరేముల గ్రామంలోని సర్వే నెం.249, 250లలో 25 ఎకరాల భూమిని 1986లో గోపాల్ నాయక్, ఆనంద్ నాయక్‌ల నుంచి 12 మంది దళితులు కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేయించుకున్నారు. 35 సంవత్సరాలకు దళితులు సాగు చేసుకుంటున్న భూమిని 2020లో ఓబులాపురానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి పేరిట దొంగ డాక్యుమెంట్లతో ఆన్‌లైన్ చేసుకున్నారు. వైసిపి నేతలు భూమన్నగారి సంజీవరెడ్డి, ఒడ్డూరు వరలక్ష్మి, పోతిరెడ్డిగారి అరుణమ్మ, అలవాల సూర్యనారాయణరెడ్డిలు భూమిని కబ్జా చేశారు. అధికారులను ఆశ్రయిస్తే స్పందించడం లేదు. భూమిలోకి వస్తే చంపేస్తామంటూ వైసిపి నేతలు బెదిరిస్తున్నారు. పోలీసులను పంపి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. న్యాయం చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దగ్గరకు వెళితే ఆ భూమి దళితులకు చెందినది కాదంటూ పొమ్మంటున్నారు. దళితులు 35 ఏళ్లుగా అనుభవిస్తున్న భూములకు సంబంధించిన పత్రాలు, ఇవి మీ వైసిపి నేతలకు ఎలా మారాయి, ఎలా కబ్జా జరిగాయో కళ్లకు కట్టినట్టున్న ఆధారాలు ఇవి. ఇప్పుడేమంటారు ఎమ్మెల్యే గారూ' అంటూ లోకేష్ ప్రశ్నించారు.

నారా లోకేష్‌కు నాగలి బహుకరించిన టిడిపి నేతలు

టిడిపి ఇన్‌ఛార్జి కెఇ.శ్యాంబాబుతో కలసి పత్తికొండ మండల సీనియర్ నాయకుడు నాగయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఎంపిటిసి దాదావలి, పులికొండ మాజీ సర్పంచి చంద్రలు నారా లోకేష్‌కు నాగలి బహుకరించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను అన్ని రకాలుగా అదుకోవాలని కోరారు. తప్పకుండా రైతుకు న్యాయం చేస్తామని లోకేష్ చెప్పారు. నాయకులు రామ్మూర్తి గౌడ్, ఉప్పర రామాంజనేయులు, బోయ రామంజనేయులు, ఈ.కాశీనాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లోకేష్‌కు నాగలి బహూకరిస్తున్న నాయకులు

పారదర్శకత్వత కోసమే...

- ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్
- మధ్యవర్తుల ప్రమేయాన్ని నిరోధించడమే లక్ష్యం
- 80 శాతం పనులు పూర్తి
- త్వరలోనే ప్రారంభం కానున్న నూతన డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు విధానం
- కర్నూలు ఆర్‌టిఒ రమేష్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో సరికొత్త ప్రక్రియను ప్రారంభించనున్నామని, ఈ విధానం ద్వారా పారదర్శకతతో పాటు ఉత్తమ డ్రైవింగ్‌ను డ్రైవర్లలో తీసుకురావాలన్నదే ముఖ్య ఉద్దేశ్యమని కర్నూలు ఆర్‌టిఒ రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రజాశక్తి ఆయనతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడారు.

ప్రస్తుతం డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు విధానం ఏ పద్ధతిలో కొనసాగుతోంది..?

ఆర్‌టిఒ : చాలా ఏళ్ల నుంచి ఇప్పటివరకు మ్యానువల్ పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ విధానాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో ఆర్‌టిఒ అధికారులు దగ్గరగా పరిశీలిస్తూ డ్రైవింగ్ నిబంధనలకు అనుగుణంగా వాహనదారుడు నడిపాడని సంతృప్తి చెందితేనే అతడికి డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసే పద్ధతి ఇప్పటివరకు ఉంది.

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో కొత్త విధానాన్ని ఏమైనా ప్రవేశపెడుతున్నారా..?

ఆర్‌టిఒ : అవును.. ప్రస్తుతం ఉన్న మ్యానువల్ టెస్టింగ్ విధానం స్థానంలో కొత్తగా సాంకేతిక విధానాన్ని అమలు చేయాలని భారత, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించాయి. ఈ మేరకు డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ విధానంలో సరికొత్త మార్పులను తీసుకొస్తోంది. ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌లో అవలంబించే ప్రక్రియ ఏమిటి..?

ఆర్‌టిఒ : ఈ విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు టెస్టింగ్ కోసం ప్రత్యేక డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను వివిధ నిర్దేశిత కేంద్రాల్లో సెన్సార్లను అమర్చి ఉంచుతారు. వీటితోపాటు ప్రత్యక్షంగా డ్రైవింగ్‌ను వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరిస్తారు. డ్రైవింగ్ చేసే వాహనదారుడు రవాణా నిబంధనలను అతిక్రమించినప్పుడు కెమెరాలు సెన్సార్లు దాన్ని గుర్తించి ఆటోమేటిక్‌గా సదరు వ్యక్తి ఫెయిల్ అయినట్లు ఫలితాన్ని ఆన్‌లైన్‌లో ప్రకటిస్తుంది. వాహనదారుడు ఎక్కడ ఏ తప్పు చేశాడో వాటిని నిర్ధారిస్తూ వీడియో లింకు సైతం డ్రైవర్ ఫోన్‌కు మెసేజ్ ద్వారా వెళ్తుంది. ఒకవేళ డ్రైవర్ అన్ని విధాలుగా సక్రమంగా వాహనాన్ని నడిపినట్లయితే ఫలితం పాస్ అయినట్లు మెసేజ్ వెళ్తుంది.

ఫెయిల్ అయితే అభ్యర్థి ఎన్ని రోజుల్లో తిరిగి డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరు కావచ్చు..?

ఆర్‌టిఒ : వాహనదారుడు పరీక్షలో ఫెయిల్ అయితే తిరిగి అతను వారం రోజుల్లో పరీక్షకు హాజరు కావచ్చు.

ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్టు ముఖ్య ఉద్దేశం ఏమిటి..?

ఆర్‌టిఒ : ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌ను ప్రవేశ పెట్టడానికి ప్రధాన కారణం ఏమిటంటే... ఇప్పటివరకు రవాణా శాఖలో కొన్ని విమర్శలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తుల ప్రమేయం, జోక్యం లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో పారదర్శకతను పెంపొందించే దిశగా ఈ ప్రక్రియను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఆటోమేషన్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్ సిస్టం నిర్మాణ పనులు ఏ మేరకు సాగుతున్నాయి..?

ఆర్‌టిఒ : ఇప్పటికే నగర శివారులో ఉన్న ఆర్‌టిఒ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న పాత డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లోనే కొత్త పనులు మొదలయ్యాయి. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. త్వరలోనే వాటిని కూడా పూర్తి చేస్తాం.

రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

రోడ్డు భద్రతకు సంబంధించి ఇప్పటికే డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తున్నాం. అతిగా వేగంతో వాహనాలు నడిపే వారిపై లేజర్ గన్నుల ద్వారా వేగాన్ని పరిశీలించి జరిమానాలు విధిస్తున్నాం.



వాగ్దానాలు గాలికి...

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

- మతోన్మాద బిజెపిని గద్దె దింపడానికి కదలిన ప్రజా చైతన్య పాదయాత్ర

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం కర్నూలు నగరంలోని 23, 24వ వార్డుల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య పాదయాత్ర కొనసాగింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సి.క్యాంపు క్వార్టర్స్, శ్రీరాంనగర్, లక్ష్మీ నగర్, జెఎన్‌ఆర్ నగర్, మద్దూర్ నగర్, రైతు బజార్ మీదుగా పాదయాత్ర కొనసాగింది. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.నరసింహులు, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డిలు హాజరయి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రతేడాది 2 కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదని, ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తోందని విమర్శించారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఎల్‌ఐసి, రైల్వే, విద్యుత్, విమానయానం, గ్యాస్, ఉక్కు పరిశ్రమ తదితర ప్రభుత్వ సంస్థలన్నింటినీ అదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. అదాని, అంబాని వంటి పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ, పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. 2014లో బిజెపి అధికారం చేపట్టినప్పుడు వంట గ్యాస్ ధర రూ.450 ఉండేదని, ప్రస్తుతం రూ.1200లకు చేరిందని తెలిపారు. పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందని చెప్పారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న రూ.లక్షల కోట్లతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పడానికి సిద్ధపడుతున్న బిజెపి నాయకులు ఏ రకంగా దేశభక్తులవుతారని ప్రశ్నించారు. దేశంలో ఆర్థిక మాంద్యం రాబోతుందని, కొనుగోలు శక్తి పడిపోయిందని, ఉపాధి అవకాశాలు తగ్గాయని తెలిపారు. లక్షలాది పరిశ్రమలు మూతపడ్డాయని, కోట్లాదిమంది ఉద్యోగులు నిరాశ్రయులయ్యారని వాపోయారు. ఉన్నత చదువులు చదివిన కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐక్యంగా ఉన్న భారతదేశ ప్రజలను కులం, మతం పేరుతో చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఉందని కోరారు. సిపిఎం 23వ వార్డు కార్యదర్శి టి.సుంకన్న, 24వ వార్డు నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఎల్లా గౌడు, ఎస్.అజ్మత్, ఆర్.శేషం రాజు, జి.ఆంజనేయులు, ఆర్.రాజు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిపిఐ నాయకులు రామాంజనేయులు, గిడ్డయ్య ఆచారి, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు పురుషోత్తం, కెవిపిఎస్ నగర కార్యదర్శి భాస్కర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు పి.నాగరాజు, కిరణ్ కుమార్, ఎం.తిమ్మప్ప, వి.సుంకన్న పాల్గొన్నారు.



యాత్రలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



బ్యాగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రమశిక్షణ చాలా అవసరం

- గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

క్రమశిక్షణ అనేది ఒక మనిషి జీవితంలో చాలా అవసరమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పెద్ద మార్కెట్ గర్ల్స్ స్కూల్ పక్కన లక్ష్మీ నరసింహ కల్యాణ మండపం హాల్లో బెల్ట్ గ్రేడింగ్, బ్యాగులు క్రీడాకారులకు డాక్టర్ శంకర్ శర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశ పౌరులని అన్నారు. ఆరోగ్యపరంగా, మానసికంగా ఉల్లాసం కలిగించే విధంగా క్రీడలు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ టి.వెంకటేశ్వర్లు, టి.తిలక అఖిల్, మధుసూదన్ రెడ్డి, భార్గవ్, సాయి కృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసు అధికారులు సస్పెన్షన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఇటీవల కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్లో వెండి దొంగిలించిన కేసులో ముగ్గురు పోలీసు అధికారులను సస్పెన్షన్ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సిఐ విక్రమసింహ, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ భాస్కర్ రాజును సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో అలక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పి హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం

ప్రజాశక్తి - తుగ్గలి/పత్తికొండ

మాజీ ఎమ్మెల్యే నీరజ రెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి తనయులు రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, డిసిసి మాజీ కార్యదర్శి లాయర్ వెంకటేశ్వర్ రెడ్డి, బిజెపి పత్తికొండ నియోజకవర్గం ఇన్చార్జి రంగాగౌడ్ తదితరులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. నీరజ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బడుగు బలహీన వర్గాల కోసం ఎంతగానో కష్టపడ్డారని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్పందన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బాధితుల నుండి జిల్లా కలెక్టర్ జి.సృజన, ఇతర ఉన్నతాధికారులు అర్జీలను స్వీకరించనున్నారు.

సమాజాన్ని మార్చే ఆయుధాలే కళలు : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సమాజాన్ని మార్చే ఆయుధాలే కళలు అని, లలితకళలు మానవ వికాసాన్ని కలిగిస్తాయని జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ఆదివారం స్థానిక టిజివి కళాక్షేత్రంలో జిల్లా స్థాయి పద్య నాటక పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. అనంతరం సత్యహరిచంద్ర, శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం వంటి నాటకాల ఘట్టాలను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా కళాకారులకు పారితోషికంతో పాటు శాలువాలతో సత్కారించారు. కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, అధ్యక్షులు పత్తిఓబులయ్య, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షులు పత్తి ఓబులయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్

మూల్యాంకనం రేట్లు పెంచాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 19 నుండి 26 వరకు జరిగే పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం రేట్లు పెంచాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.ఎల్లప్ప, ఎస్ఎం.జయరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2015 పిఆర్‌సి ప్రకారం ఒక పేపర్ వ్యాలుయేషన్ 6:60 పైసలు చెల్లించడం సమంజసం కాదని, పిఆర్‌సి–2020 ప్రకారం రేట్లు పెంచాలని తెలిపారు. గతంలో 50 మార్కులకు మూల్యాంకనం చేసేవారని, ప్రస్తుతం100 మార్కులకు చేయాలన్నారు. గణితంలో కనీసం 3 సంవత్సరాలు కూడా భోదన అనుభవం లేని 2021, 2022లో నియమింపబడిన, పదోన్నతి పొందిన 12మంది ఉపాధ్యాయులకు మూల్యాంకనం ఆర్డర్స్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 60 ఏళ్ళ పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, పిహెచ్సీ వారికి మూల్యాంకనం విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు మారెప్ప, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జీవిత, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, కార్యదర్శులు దావీదు, నవీన్ పాటి, నరసింహులు, లక్ష్మీదేవి, రాష్ట్ర కౌన్సిలర్స్ ఖాసీం, యొహెూషువా తదితరులు పాల్గొన్నారు.

మే డేను పురస్కరించుకుని క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ సంయుక్తంగా మే డేను పురస్కరించుకుని ఆదివారం జొహరాపురం రోడ్‌లోని మైపర్ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ, ప్రభాకర్ రెడ్డిలు ప్రారంభించారు. మెడికల్ యూనియన్ నాయకులు వెంకట్, రాష్ట్ర నాయకులు బసవరాజు, అధ్యక్ష కార్యదర్శులు మారుతి, శేషాద్రిలు మాట్లాడారు. మే డేను పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లాగౌడ్, ఖలీల్ అహ్మద్, శివ, రంగ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రసాద్ శర్మ

పేదలకు చేయూత

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ట్రాంట్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ అధినేతలు లోకనాథ్ రెడ్డి తేజస్విని, 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి పేదలకు చేయూతనందించారు. ఆదివారం కల్లూరు అర్బన్ శరీన్ నగర్ జెండాబడి పాఠశాలలో పేదలకు పనిముట్లు, చిన్నారులకు నోట్ బుక్కులు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, అడ్వకేట్‌లు నరసింహులు, నాగరాజు, నవీన్ నాథ్ రెడ్డి, రోజా రాణి, కృపాసాగర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, పిడి భాష, తిరుమలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న లోకనాథ్ రెడ్డి తేజస్విని, కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి తదితరులు

కార్పొరేట్లకు మోడీ దాసోహం

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

దేశానికి అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం ప్రధాని మోడీ కార్పొరేట్లకు దాసోహమై ధారాదత్తం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. ఆదివారం స్థానిక బుధవార పేటలోని అభిముబారక్ నగర్, కమ్మగేరి, చాకలి గేరి, షాదిక్ నగర్, రసూల్ తోట, విరుపాక్షయ తోట, 48వ పేట, చానిక్య పురి కాలనీలో సిపిఎం, సిపిఐలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరి నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని,నల్లధనాన్నంతా బయటకు తెచ్చి పేద కుటుంబాలకు 15 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలపై బారాలు మోపుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటుపరం చేస్తూ నిత్యవసర ధరలు పెంచుతూ, రైతులను, కార్మికులను మోసం చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడాలన్నారు. ప్రజలు ఇప్పటికైనా గుర్తించి రేపు రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ నగర సహాయ కార్యదర్శిలు చంద్రశేఖర్, మహేష్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, నగర కమిటీ సభ్యులు ఆర్ కృష్ణ, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు బజారి, ప్రకాష్, రాజు, సుధాకర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార బేరి కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. **కోడుమూరు :** మండలంలోని వర్కూరు గ్రామంలో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార బేరి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి గఫూర్ మియా, సిపిఐ మండల కార్యదర్శి బి.రాజులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బజ్జీల వీరన్న, ఏఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, జీప్ డ్రైవర్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న రాముడు, వర్కూరు గ్రామ శాఖ నాయకులు కొళాయిల రాముడు, మునిస్వామి, గౌరన్న, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు పిఎస్ రాధాకృష్ణ





కోడుమూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ కృషి

- కేంద్ర మాజీ మంత్రి కోట్ల, మాజీ ఎమ్మెల్సీ కెఇ

ప్రజాశక్తి - దేవనకొండ



దేవనకొండలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కోట్ల, కెఇ

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు అని టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్ కొనియాడారు. ఆదివారం దేవనకొండ పంచాయతీ కార్యాలయ సమీపంలో టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి దేవనకొండ మండలంలో సోమ, మంగళవారాల్లో పర్యటిస్తున్న నారా లోకేష్ యువ గళం పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, మల్లయ్య, ఈదుల దేవరబండ సుభాన్, మల్లికార్జున గౌడ్, వెంకటస్వామి గౌడ్, పురుషోత్తం గౌడ్, రాజశేఖర్ గౌడ్, రాజాసాబ్, సర్పంచులు భాస్కర్, మహేశ్వర్ రెడ్డి, చిన్న రామప్ప, ఎంపిటిసి తిమ్మప్ప, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, శిల్పి మల్లేష్, బండ్లయ్య, మాల బండ్లయ్య, చాంద్ బాషా, సుభాన్, మస్తాన్, వెంకటరెడ్డి, చిన్న రాముడు, నాగేష్, లతీఫ్, ఎండ తిమ్మయ్య, సూరన్న గౌడ్, రవికుమార్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని కిల్చిన్ పేటలో 90, వాల్మీకి నగర్‌లో 20 మందికి టిడ్కో పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబిసీ వర్గాలకు కులమతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమ న్యాయం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఆలోచించి ఏ పార్టీ మంచి చేసిందో తెలుసుకోవాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, కౌన్సిలర్ బి.ఇందు, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, వార్డు ఇన్‌ఛార్జీ దుర్గప్ప, బ్రహ్మా, రఘు, అబుబాకర్, విజయ్, వెంకటేష్, చంద్ర, కామాక్షి తిమ్మప్ప, సింహం నాగేంద్ర, తాయన్న, శ్రీదేవి, అన్నపూర్ణ, సుధాకర్, దస్తగిరి, బాష, రఘు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకుందాం

- డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్

ప్రజాశక్తి - ఆదోని

దళిత జాతి కోసం అందరమూ ఏకమై ఐక్యత చాటుదామని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి టి.వీరేష్ కోరారు. డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే సామూహిక వివాహాలను జయప్రదం చేయాలని ఆదివారం ద్వారక ఫంక్షన్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవతవాదులైన బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బసవేశ్వర స్వామి జయంతి సందర్భంగా ఆదోనిలో ఎన్నడూ లేనివిధంగా కులమత భేదాలు లేకుండా సామూహిక వివాహాలు జరిపిస్తున్నామని తెలిపారు. తమవంతు సహాయ, సహకారాలు అందించి దళితుల ఐక్యత చాటాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు చలపతి, మధు, డిహెచ్‌పిఎస్ జిల్లా సమితి సభ్యులు విజయ్, నాయకులు కుమార స్వామి, గోవిందరాజులు, దానం, రైల్వే ఈరన్న, ఈరన్న, నాగరాజు, ఆవుల సురేష్, జయ రాము, పులి రాజు, మనీ, వంశీ, దేవేంద్ర, సోమశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్

మోడీ పాలనకు చరమగీతం పాడాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలో ప్రచార భేరిని ఉద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

నిరంకుశ పాలన కొనసాగిస్తున్న ప్రధాని మోడీని గద్దె దించి ఆయన పాలనకు చరమగీతం పాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. ఆదివారం రాత్రి ఆదోని పట్టణం కల్లుబావి, శంకర్ నగర్‌లో జరిగిన ఇంటింటి ప్రచార భేరిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు మోడీ నిరంకుశ పాలన వైఫల్యాల గురించి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. నాయకులు అజయ్ బాబు, సుదర్శన్, లక్ష్మణ్, గోపాల్, ముక్కన్న, నాగరాజు, వీరేష్, మహానంద రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు. **ఆలూరు :** బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడి దేశాన్ని రక్షించుకుందామని సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరి ఆదివారం అగ్రహారం, కురవల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, నాగరాజు, గోవర్ధన్, మైనా, కె.నాగరాజు, సిపిఐ నాయకులు శివ పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపుదామని సిపిఎం నాయకులు కోరారు. వామపక్షాల ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రచార భేరి యాత్ర రెండో రోజు పెద్ద తుంబలం, కుప్పగల్, బల్లేకల్ గ్రామంలో నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కమిటీ సభ్యులు తిక్కప్ప, హనుమంతు రెడ్డి మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య ప్రమాదంలో పడిందని తెలిపారు. ప్రతి వ్యక్తీ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఇదని చెప్పారు. మోడీ- అమిత్ షా నాయకత్వంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషాలతో చిచ్చు రాజేస్తోందని విమర్శించారు. మరోవైపు అదాని, అంబాని లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోందని తెలిపారు. సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, చిరంజీవి, దాసప్ప, బాష, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : కేంద్రంలోని మతోన్మాదంతో దేశాన్ని నాశనం చేస్తున్న బిజెపిని ఇంటికి సాగనంపుదాం, దేశాన్ని రక్షించుకుందామంటూ సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. బిజెపి ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మూడోరోజు శివన్న నగర్ కాలనీలోని శివారు కాలనీ ప్రాంతంలో ప్రచారభేరి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, సిపిఎం నాయకులు రాముడు మాట్లాడారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పేదల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి రాకముందు ఒక సిలిండర్ గ్యాస్ ధర రూ.450 ఉంటే, నేడు రూ.1200లకు చేరిందని చెప్పారు. రూ.70 ఉన్న పెట్రోలు, రూ.60 ఉన్న డీజిల్ నేడు రూ.100 దాటాయని తెలిపారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు పేదోడికి అందుబాటులో లేకుండా మండుతున్నాయని చెప్పారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, సమీవుల్లా, సిపిఐ నాయకులు ఖాజా, మల్లికార్జున గౌడ్, ఖాదర్, నరసింహులు, సుంకన్న, రవి, బాష, తాయప్ప, సత్య పాల్గొన్నారు.



ఆదోనిలో ప్రచార భేరి నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు



ఎమ్మిగనూరులో ప్రచార యాత్ర నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ఘనంగా కందుకూరి జయంతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల సమీపంలోని నటరాజ్ స్వామి కెఎన్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సమక్షంలో లలిత కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన మూఢనమ్మకాలను తొలగించే ప్రయత్నం చేశారన్నారు. సతీ సహగమనం అరికట్టడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడం, బాల్యవివాహాలను అరికట్టడం, స్త్రీల విద్యను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు ఎన్నో చేశారన్నారు. అనంతరం లలిత కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు అబ్దుల్లా, కళాకారులు శివ రాములు, హనుమాన్ సింగ్, కుమార్ గౌడ్, నల్లారెడ్డిని సన్మానించారు. ప్రభుత్వం కళాకారులకు పింఛను, గుర్తింపు కార్డులు, ఆర్థిక సహాయం చేసినప్పుడే కళలు కలకాలం బతికి ఉంటాయని, కళలు బతికినప్పుడే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. సమాజంలో నేటికీ కొనసాగుతున్న మూఢనమ్మకాలను తొలగించాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉందన్నారు.



కందుకూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం

- దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి ఆవిర్భావం నుంచి సాంప్రదాయబద్ధమైన ఓటు బ్యాంకుగా ఉన్న దూదేకుల కులస్తులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని నూర్‌బాష దూదేకుల (బీసీ) ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.సాయి బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని భీమాస్ హోటల్‌లో జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి జిల్లాకు ఒక ఎమ్మెల్యే, రాయలసీమ, కోస్తా, ఆంధ్ర ప్రాంతాలకు ఒక ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 18 లక్షల జనాభా ఉందని, కర్నూలు జిల్లాలో 2 లక్షలు ఉన్నట్లు తెలిపారు. దూదేకులను రాజకీయంగా రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కార్పొరేషన్లలో పదవులు, జిల్లా, మండల పరిషత్‌లలో 50 శాతం కోఆప్షన్ మెంబర్లు, సర్పంచి పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలకు తమ ప్రతిపాదనపై వినుతులను ఇచ్చామన్నారు. వివాహాలు, శుభకార్యాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయింపు, పక్కన ముస్లిం పదం చేర్చడం తదితర దూదేకుల కులస్తుల న్యాయమైన, ప్రధాన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను జిల్లాలో మాజీ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. తాలూకా, మండల కమిటీలు వినతులు ఇవ్వాలని తీర్మానించారు. సంఘం ఆదోని తాలూకా అధ్యక్షులు మన్సూర్, రాష్ట్ర నాయకుడు నబి రసూల్, ఆలూరు తాలూకా అధ్యక్షులు సాలి సాహెబ్, ఆదోని తాలూకా జనరల్ సెక్రటరీ మాబు సాహెబ్, మంత్రాలయం తాలూకా అధ్యక్షులు టిప్పు సుల్తాన్, హోళగుంద మండల అధ్యక్షులు సాయి బేస్, ఆస్పరి మండల అధ్యక్షులు బాలన్న, సీనియర్ నాయకులు నబి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబు



టిడిపి ఫ్లెక్సీల రగడ

- బహిర్గతమైన వర్గ విభేదాలు

ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ మండలంలో లోకేష్ యువగళం పర్యటన సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటులో రగడ నెలకొంది. టిడిపిలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ దంపతులు దేవనకొండలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరోవైపు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీలు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వీరభద్ర గౌడ్, ఆస్పరి మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మల ఫ్లెక్సీలు సైతం దేవనకొండలో ఏర్పాటు చేశారు. వైకుంఠం శివప్రసాద్ అనుచరులు ఫ్లెక్సీలు శనివారం రాత్రి ఏర్పాటు చేస్తుండగా మరో వర్గానికి చెందిన టిడిపి వారు అడ్డుకోవడంతో వివాదం తలెత్తింది. కొన్ని చోట్ల బ్యానర్లు చించి వేశారు. శివప్రసాద్ వర్గీయులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు టిడిపి వర్గానికి చెందిన బెల్దోన నారాయణప్ప అనుచరులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి ఆదివారం దేవనకొండకు వచ్చారు. ఆయా ఫ్లెక్సీలలో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఫొటో ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఫ్లెక్సీలు మండలంలో ఏర్పాటు చేయకూడదని అడ్డుకున్నారు. ఆలూరు టిడిపి వర్గ విభేదాలు ఇలానే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో టిడిపి ఏ మేరకు విజయం సాధిస్తుందో అర్థం కాని పరిస్థితి ఉందని మేధావి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు అని గ్రేడ్-2 గ్రంథాలయ అధికారి వజ్రాల గోవింద్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కందుకూరు వీరేశ లింగం జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారులు వజ్రాల గోవిందరెడ్డి, యస్ బాషా, చంద్రమ్మ, నసీమబీ, ఈశ్వరమ్మ, శ్రీనువాసులు, ఉమా, విద్యార్థులు, పాఠకులు కందుకూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, రవి, వెంకటేష్, శ్రీలక్ష్మి, నారాయణ, శ్యాం, అర్జున్, సాయి దుర్గ, లావణ్య, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న సర్పంచి

మృతుని అంత్యక్రియలకు సాయం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో ఆదివారం హరిజన బాలరాజు (35) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచి చంద్రశేఖర్ బాలరాజు మృతదేహానికి పూలమాల వేసి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న వయస్సులోనే అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని తెలిపార. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలను సర్పంచి చంద్రశేఖర్ మృతుని తండ్రి తాయప్పకు ఆర్థిక సహాయం అందజేశారు. గృహ సారథులు, వార్డు సభ్యులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

- అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక అధికారి జి.రామాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గాంధీ నగర్‌లోని శిల్ప ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


గ్రామాల్లో ప్రభుత్వాస్పత్రిలో...

వైద్య సేవలు నిల్

- కనీస సౌకర్యాలు కరువు - ఇబ్బందుల్లో రోగులు

- సమయపాలన పాటించని వైద్యులు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



నూతనంగా నిర్మించిన పిహెచ్‌సి

మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం ప్రభుత్వాస్పత్రి ఒకప్పుడు రోగులతో కిటకిటలాడేది. నేడు వైద్యులున్నా రోగులు లేక వెలవెలబోతుంది. పేరుకే 30 పడకల ఆస్పత్రి. ఒక్క పడక కూడా సరిగ్గా లేదు. 24 గంటలు పేదలకు వైద్యం చేయడానికి సిబ్బంది వైద్యులు ఉండాలి. పేరుకే 24 గంటల ఆస్పత్రి. మూడు దాటితే ఒక్కరు ఉండరు. వైద్యులందరికీ ప్రయివేట్ క్లినిక్‌లు ఉండడంతో అక్కడే గడిపేస్తున్నారు. ఎలాగో ఇక్కడ జీతం వస్తుంది కదా అన్న ధీమాతో అక్కడే పూర్తి సమయం కేటాయిస్తున్నారు. ఇద్దరు వైద్యులకు గాను రోజుకు ఒకరు చొప్పున విధులు నిర్వహించాలి. ఆస్పత్రిలో వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా వారానికొకరు చొప్పున విధులకు హాజరవుతున్నారు. మిగతా వారు సొంత క్లినిక్‌లో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రక్త పరీక్షలు నిల్...

వైద్యానికి వచ్చే రోగులకు రక్త పరీక్షలు నిర్వహించడానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో పట్టణానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆస్పత్రికి పక్కా భవనం ఉన్నా అన్నీ సమస్యలే...

ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ ఉన్నా ఆపరేషన్ చేసిన దాఖలు లేవు. ఎక్స్‌రే మిషన్ ఉన్నా ఎక్స్‌రే తీసిన దాఖలాలు లేవు. ఆయుష్ విభాగానికి సంబంధించి కాంపౌండర్, వైద్యులు ఉన్నా మందులు సరిగా ఉండకపోవడంతో వాటి కోసం వచ్చే వారే కరువయ్యారు. పెద్దహరివాణం, పెద్దతుంబలం ఆస్పత్రి పరిధిలో ఒక్కో పిహెచ్‌సికి మొత్తం 10 నుంచి 18 సబ్ సెంటర్లు ఉండగా, ఎఎన్ఎం అక్కడక్కడ ఖాళీగా ఉండడం చేత, రెగ్యులర్ ఎఎన్ఎంలు లేకపోవడంతో ఆరుగురు సెకండ్ ఎఎన్ఎంలతోనే నడపడం జరుగుతుంది.

ఎమ్మెల్యే సందర్శించినా.. మారని సిబ్బంది తీరు

గత కొంతకాలంగా పెద్దహరివాణం ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలపై చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రికి నిధులు కేటాయించి అభివృద్ధి చేసి ఆస్పత్రిలో కాన్పులు జరిగే విధంగా కృషి చేసి పేదలను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం..

వైద్య పరిస్థితులు మెరుగు పడాలంటే.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వైద్యాధికారుల తీరు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని, పర్యవేక్షణ లోపించిందని విమర్శిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో గల ప్రజలకు వైద్య సేవలను అంతంతమాత్రంగా అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యం అందించడంలో అధికారుల మొండి వైఖరి, నిర్లక్ష్యాన్ని ప్రజలు ఘాటుగా విమర్శిస్తున్నారు. వైద్యాధికారులు, సిబ్బందిలో మార్పు రానంత వరకు సామాన్యులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలుతుంది.

కలెక్టర్ దృష్టి పెట్టాలి

మెరుగైన వైద్య సేవలు ముఖ్యంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా వైద్య విధానంపై కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. వైద్యాధికారుల పనితీరులో మార్పు తీసుకొచ్చేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి

- లింగన్న, సిపిఎం మండల కార్యదర్శి

ప్రభుత్వాస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించలేని దయనీయ స్థితి కొనసాగుతోంది. వసతులు సక్రమంగా లేకపోవడంతో రోగులు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. రాజకీయ నాయకులు మారుతున్నారే తప్ప ఆస్పత్రి స్థితిగతులు మారడం లేదు. వైద్యులు సక్రమంగా విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారులు చూడాలి.



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

అగ్ని బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 1వ వార్డులో అగ్ని ప్రమాదం సంభవించి లక్ష్మీనారాయణ, లలితలకు సంబంధించిన గుడిసె, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. టిడిపి వార్డు కౌన్సిలర్ పార్వతీ వెంకటేష్, టిడిపి యువ నాయకులు సిద్ధార్థ నాయుడు స్పందించి మానవత దృక్పథంతో సహాయం అందజేశారు. ఆదివారం అగ్ని బాధితులకు రూ.10 వేలు నగదుతోపాటు 25 కిలోల బియ్యం, మంచి నూనె, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులు అందించారు. అగ్ని బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు బుద్ధారెడ్డి, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకొరగా పనులు : సిపిఎం

- కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంకు గండి బడిన ప్రాంతాన్ని పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలో కుప్ప గల్లు ఎస్ఎస్ ట్యాంకు 2018లో గండి పడిందని, ఆ గండిని ఇప్పటిదాకా పూడ్చకుండా ఈ మధ్యనే పనులు ప్రారంభించి అరకొరగా పనులు చేస్తున్నారని సిపిఎం నాయకులు తెలిపారు. ఆదివారం గండిపడిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు మాట్లాడారు. గండి పడడం వల్ల కేవలం 10 అడుగులు మాత్రమే నీళ్లు నిల్వ ఉన్నాయని తెలిపారు. ఈ నీళ్లు 7 గ్రామాలకు ఒక నెలకు కూడా సరిపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల నాయకులు కె.శేఖర్, రామాంజనేయులు, పాండురంగ, విరుపాక్షి, పార్టీ సభ్యులు హనుమంతు రెడ్డి, వార్డు సభ్యులు హుసేని, గోవింద రెడ్డి, ఆంజనేయ పాల్గొన్నారు.

'యువగళం'కు స్వాగతం పలికిన నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ



ఎంకె.కొట్టాల గ్రామంలోకి ప్రవేశించిన పాదయాత్ర

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం రాత్రి దేవనకొండ మండలంలోని ఎంకె.కొట్టాల గ్రామంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, ఆమె కుమారుడు కోట్ల రాఘవేంద్రా రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. సోమ, మంగళవారాలు మండలంలోని గుండ్లకొండ, గుడిమిరాల, బుర్రకుంట, కె.వెంకటాపురం, పల్లె దొడ్డి, గద్దెరాళ్ల, దేవనకొండ, కుంకనూరు గ్రామాల మీదుగా ఆస్పరి మండలంలోకి వెళ్లనుంది. ఈ పాదయాత్ర కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మల్లయ్య, సుభాన్, బడి గింజల రంగన్న, వెంకట స్వామి గౌడ్, మల్లికార్జున గౌడ్, రాందాస్ గౌడ్, రాజా సాబ్, బండ్లయ్య పాల్గొన్నారు.

రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. ఆదివారం ఏకాదశీ తిథి సందర్భంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన చేసి కాషాయ వస్త్రాలతో తులసి మాలతో అలంకరించారు. అనంతరం పూజారులు మంగళ హారతులు ఇచ్చారు. ఏకాదశీ సందర్భంగా స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు అన్నదానం, పరిమళ ప్రసాదం విక్రయం లేకపోవడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం.